సాక్షి మహబూబ్‌నగర్

సోమవారం ǀ 1 ǀ ఏప్రిల్ ǀ 2024





అడ్డగోలుగా వెంచర్లు

జడ్చర్ల పరిధిలో అడ్డగోలుగా వెంచర్లు ఏర్పాటు చేసి అక్రమార్జనకు పాల్పడుతున్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
41.4 /19.3

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి తైబజార్ రద్దు

స్టేషన్ మహబూబ్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో వీధి వ్యాపారులకు ఇచ్చిన **హామీ మేరకు** సోమవారం నుంచి జిల్లాకేంద్రం**లో తైబజార్** రద్దు చేస్తున్నట్లు ఎమ్మెల్యే యె**న్నం శ్రీనివాస్** రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలో**ని కాంగ్రెస్** కార్యాలయంలో ఆదివారం ఆ**యన విలేకరుల** సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఏ హామీని ఇచ్చినా దానిని చట్టబద్ధంగా అమలు చేస్తుందన్నారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీని హస్తగతం చేసుకున్న తర్వాత మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేసి తైబజారును రద్దు చేయించామన్నారు. కొన్నివేల మంది చిరువ్యాపారులు రోజంతా కష్టపడి వచ్చిన ఆదాయంలో అధిక భాగం తైబజార్‌కే చెల్లిస్తున్నారని, కొన్నిసార్లు గిరాకీ లేకున్నా తైబజార్ కట్టేవారని.. ఎట్టకేలకు వారికి తైబజార్ నుంచి విముక్తి లభించిందన్నారు. తైబజార్ కాంట్రాక్ట్ సమయం ముగిసిందని, ఇకపై ఎవరూ తైబజార్ వసూలు చేయకూడదని, వీధి, చిరువ్యాపారులు ఇవ్వకూడదన్నారు. తైబజారు పేరున బలవంతపు వసూళ్లు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. పేదల కష్టార్జితం మనకు అవసరం లేదని, ఇతర మార్గాల్లో ఆదాయం పెంచుకునేందుకు ప్రయత్నిస్తామని, అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక గ్రాంట్ ద్వారా అధిక నిధులు తెస్తామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డిని చూసి ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటేసి గెలిపించాలని ప్రజలను కోరుతామని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. మహబూబ్‌నగర్ అభివృద్ధి కోసం 75 ఏళ్లు వేచి చూశామని, ఇప్పుడు ఆ అవకాశం లభించడం సంతోషంగా ఉందన్నారు. సిరిసిల్ల, గజ్వేల్ మాదిరిగా పాలమూరును అభివృద్ధి చేసుకుంటామన్నారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, నాయకులు ఎన్పీ వెంకటేశ్, సీజే బెనహర్, కిరణ్ పాల్గొన్నారు.

మార్కెట్ ఫీజు చెల్లించొద్దు

మున్సిపాలిటీలోని వీధి వ్యాపారులు ఇక నుంచి తైబజార్ (మార్కెట్ ఫీజు) చెల్లించాల్సిన అవసరం లేదని మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ మహమ్మద్ ఖాజా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారి నుంచి ఎవరైనా వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌ల నియామకం

సాక్షి, నాగర్‌కర్నూల్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ ఆదివారం ప్రకటన జారీ చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి ఇన్‌చార్జ్‌గా మంత్రి జూపల్లి కృష్ణారావు, మహబూబ్‌నగర్ స్థానానికి సంపత్‌కుమార్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించినట్లు ప్రకటనలో పేర్కొంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రచార బాధ్యతలతో పాటు పార్టీ కార్యక్రమాలను వీరు పర్యవేక్షిస్తారు. అలాగే హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ నియమితులయ్యారు.

జీతాలు రాలే..

8లో ▸

- మూడు నెలలుగా ఉపాధి సిబ్బందికి అందని వేతనాలు
- జిల్లావ్యాప్తంగా 155 మంది ఉద్యోగులు
- ఐకేపీ వారిది సైతం అదే పరిస్థితి

\- జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్)

మిగిలేది బుగ్గే..

అగ్నిప్రమాదాలతో భారీస్థాయిలో ఆస్తినష్టం



మంటలు అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది (ఫైల్)

- అగ్నికి ఆజ్యం పోసేలా మారుతున్న ఎండలు
- కొత్త కేంద్రాల ఏర్పాటుపై ప్రభుత్వం మీనమేషాలు
- 50- 100 కి.మీ., దూరానికి సైతం పట్టణాల నుంచి పరుగులు
- ఈ ఏడాది ఇప్పటికే పలు ప్రమాదాలతో రూ.కోట్ల మేర బుగ్గిపాలు

మహబూబ్‌నగర్ క్రైం: వేసవికాలం వచ్చింది.. రోజురోజుకూ ఎండలు ముదురుతున్నాయి. ఈ క్రమంలో అగ్ని ప్రమాదాలు జరగడానికి ఆస్కారం ఎక్కువ. అయితే అగ్గి రాజుకుంటే సకాలంలో వెళ్లి మంటలు ఆర్పడానికి సరిపడా అగ్నిమాపక వాహనాలు లేవు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం రూరల్ ప్రాంతాల్లో 25 కి.మీ., లేదా 50 వేల జనాభాకు, పట్టణాల్లో 10 కి.మీ., విస్తీర్ణంలో ఒక అగ్నిమాపక కేంద్రం ఉండాలి. కానీ, మహబూబ్‌నగర్ జిల్లాలో ఎక్కడా ఈ నిబంధన అమలు కావడం లేదు. 50 నుంచి 100 కి.మీ., దూరంలో జరిగే ప్రమాదాలను నివారించడానికి వాహనాలు వెళ్లాల్సి వస్తుండటంతో తీవ్రనష్టం జరిగిపోతోంది. ఫలితంగా బాధితులకు బూడిద తప్ప ఏమీ మిగలడం లేదు.

తప్పని దూరభారం

జిల్లాలో 16 మండలాలు ఉండగా.. కొన్ని పెద్దవి.. మరికొన్ని చిన్న మండలాలు ఉన్నాయి. అలాంటి చోట్ల కనీసం ఒక ఫైర్ స్టేషన్ కూడా లేదు. కొన్ని కేంద్రాలు నాలుగైదు మండలాల్లోని గ్రామాలకు సేవలందిస్తున్నాయి. ఉదాహరణకు గండేడ్, మహమ్మదాబాద్, కోయిలకొండ మండలాల పరిధిలోని గ్రామాలకు మహబూబ్‌నగర్ నుంచి ఫైర్ ఇంజిన్ వెళ్లాల్సి ఉంటుంది. జిల్లాలో చాలా మండలాల్లోని గ్రామాలకు రోడ్డు వసతి కూడా అంతంత మాత్రమే. ఈ లెక్కన ఫైర్ ఇంజిన్లు సంఘటనా స్థలానికి చేరుకోవడానికి కనీసం గంటన్నర సమయం పడుతుంది. ఈలోపు ప్రమాదంలో ఆస్తులన్నీ కాలి బూడిదవుతున్నాయి. జిల్లాలో మొత్తం 441 గ్రామాలు ఉండగా.. కేవలం రెండు ఫైర్ ఇంజిన్లతో మారుమూల గ్రామాలకు సైతం వెళ్లడానికి చాలా ఇబ్బంది అవుతుంది.

ప్రమాదాల కాలం

వేసవిలో తరచుగా ఏదో ఒకచోట అగ్ని ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. భానుడి భగభగకు ఇల్లు, గడ్డివాములు, అడవులు, దుకాణ సముదాయాలు, పత్తి మిల్లులు, వాహనాలు కాలిపోతుంటాయి. ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతుంటాయి. ఆస్తి, ప్రాణనష్టం సంభవిస్తూనే ఉంటుంది. ప్రమాదాల కారణంగా సర్వస్వం కోల్పోయిన కుటుంబాలు వీధిన పడుతుంటాయి. ఏటా ప్రమాదాలు పునరావృతమవుతాయి. మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక శాఖది కీలక పాత్ర. వీరు సకాలంలో వస్తే ఆస్తినష్టం జరగకుండా కాపాడుకోవచ్చు. ఇప్పటికే వారం రోజుల క్రితం కోడూరు సమీపంలో జరిగిన అగ్నిప్రమాదంలో రూ.2 కోట్ల మేర నష్టం వాటిల్లింది.

జిల్లాలో గతేడాది ప్రమాదాలు ఇలా..

మొత్తం అగ్నిప్రమాదాలు	బాధితులకు జరిగిన నష్టం
120	రూ.208.15 లక్షలు
అగ్నిమాపక శాఖ అధికారులు కాపాడిన ఆస్తి	రూ.487.37 లక్షలు
మహబూబ్‌నగర్ అగ్నిమాపక కేంద్రానికి వచ్చిన ఫైర్ కాల్స్ : 61	జడ్చర్ల అగ్నిమాపక కేంద్రానికి వచ్చిన ఫైర్ కాల్స్ : 32

చిన్న ప్రమాదాలు పెరిగాయి..



జిల్లాలో ఇటీవల చిన్న ప్రమాదాలు పెరిగాయి. చిన్న వాటికి బుల్లెట్, మిస్ట్ జీప్‌లు వాడుతున్నాం. వేసవి పూర్తయ్యే వరకు శాఖలో పనిచేస్తున్న సిబ్బంది, ఇతర అధికారులు ఏ ఒక్కరు అత్యవసరమైతే తప్ప సెలవు తీసుకోకుండా పనిచేస్తాం. జాతీయ రహదారిపై ప్రత్యేక దృష్టిపెట్టాం. ఎక్కడ ప్రమాదం జరిగినా వెంటనే చేరుకోవడానికి కృషి చేస్తాం. ప్రస్తుతం వేసవి నేపథ్యంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి కిందిస్థాయి అధికారులకు ఆదేశాలిస్తాం.

\- కిషోర్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి

కేంద్రాల ఏర్పాటులో మీనమేషాలు

అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటులో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. ప్రమాదాలు జరిగినప్పుడల్లా కంటి తుడుపు చర్యగా నేతలు, అధికారులు పరామర్శించి వెళ్లిపోతారు. త్వరలోనే ఆయా ప్రాంతాల్లో అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు చేస్తామని హామీలు గుప్పిస్తారు. ఆ తర్వాత ఎలాంటి ఉలుకు పలుకు ఉండదు. తిరిగి ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు మళ్లీ మొదటికే వస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పటి నుంచి ఈ కేంద్రాల ఏర్పాటు కలగానే మిగులుతోంది. తెలంగాణ ఏర్పాటు తర్వాత కూడా ప్రతి నియోజకవర్గానికి ఓ కేంద్రం ఏర్పాటు చేస్తాయని ప్రకటించినా.. ప్రతిపాదనలకే పరిమితమవుతున్నాయి. కొత్తగా జిల్లాలో దేవరకద్ర నియోజకవర్గంలోని కొత్తకోటలో ఏర్పాటు చేయగా దీంతోపాటు గండేడ్‌లో ఫైర్ స్టేషన్స్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు ఉన్నాయి.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాలో క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. క్రీస్తు మహిమలను పాటల ద్వారా కొనియాడారు. పలుచోట్ల ధార్మిక ప్రసంగాలు చేశారు. ఆయా చర్చిల్లో ఈస్టర్‌ను పురస్కరించుకొని ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు క్రైస్తవులు ప్రత్యేక కార్యక్రమాలు, ప్రార్థనలు జరిపారు. ఎంబీసీ చర్చి చైర్మన్, సీనియర్ పాస్టర్ రెవరెండ్ ఎస్.వరప్రసాద్ అధ్యక్షతన జిల్లాకేంద్రంలోని కల్వ రికొండపై ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ ఆశీర్వాదం ప్రసంగీకుడిగా హాజరై విశ్వమానవ కల్యాణాన్ని కాంక్షిస్తూ ప్రార్థనలు జరిపి, ఈస్టర్ ప్రాముఖ్యతను వివరించారు.

వేడుకల్లో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు

ఈస్టర్ వేడుకల్లో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థులు చల్లా వంశీచంద్‌రెడ్డి, డీకే అరుణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మానవ జన్మ ఎంతో పవిత్రమైనదని, సన్మార్గంలో మనం జీవించినంత కాలం భగవంతుడు, ప్రకృతి సహకరిస్తాయని చెప్పారు. వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ కల్వరికొండపై ఈస్టర్ పండుగలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. డీకే అరుణ మాట్లాడుతూ ధర్మం దారి తప్పినప్పుడూ ఆ దేవుడే ఏదో ఒక రూపంలో తిరిగి వస్తాడు అనే నమ్మకానికి నిదర్శనం ఈస్టర్ పండుగ అన్నారు. కార్యక్రమంలో ఎంబీసీ చైర్మన్ రెవరెండ్ ఎస్.వరప్రసాద్, వైస్ చైర్మన్ టీఐ.జేకబ్, కార్యదర్శి జేఐ.డేవిడ్, కోశాధికారి టీఏ.స్టీవెన్, సహ కోశాధికారి ఎ.టైటస్‌రాజేందర్, రవికుమార్, సంఘ కార్యవర్గ సభ్యులు, ప్రముఖులు డాక్టర్ శామ్యూల్,వినోద్ కుమార్, సీజే బెనహర్ పాల్గొన్నారు.



కల్వరి కొండపై జరిగిన ఈస్టర్ వేడుకల్లో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం, ఎంపీ అభ్యర్థులు వంశీచంద్‌రెడ్డి, డీకే అరుణ, క్రైస్తవ పెద్దలు



కార్యక్రమంలో పాల్గొన్న క్రైస్తవులు

అట్టడుగుకు జలాలు



కోతిగుండు సమీపంలోని కేఎల్ఐ అప్రోచ్ కెనాల్ వద్ద తగ్గిన నీటిమట్టం

- శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో గణనీయంగా తగ్గిన నీటిమట్టం
- త్వరలోనే తాగునీటి అవసరాలకూ వాడుకోలేని పరిస్థితి
- మిషన్ భగీరథ సరఫరాకు ఇక గడ్డుకాలమే..
- మరో 6 టీఎంసీలు మాత్రమే వాడుకునే అవకాశం
- తాగునీటికి ఇబ్బంది లేదంటున్న అధికారులు

శ్రీశైలంలో ప్రస్తుతం బ్యాక్‌వాటర్ నిల్వ	కేఎల్ఐ ద్వారా నీటి పంపింగ్ చేసే అవకాశం
811 అడుగులు	800 అడుగులు
ప్రస్తుతం ఉన్న నిల్వల ప్రకారం తాగునీటికి వాడుకునేది	6 టీఎంసీలు
వేసవి ముగిసే వరకు తాగునీటికి అవసరమైన నీరు (అధికారుల లెక్కల ప్రకారం)	3.5 టీఎంసీలు
గతేడాది ఇదే సమయానికి ఉన్న నీరు	830 అడుగులు

కొల్లాపూర్: కృష్ణానదిలో జలాలు క్రమంగా అడుగంటుతున్నాయి. శ్రీశైలం డ్యాంలో బ్యాక్‌వాటర్ లెవల్స్ రోజురోజుకూ తగ్గిపోతోంది. జనవరి నెలాఖరులో 829 అడుగుల మేర ఉన్న బ్యాక్‌వాటర్ ప్రస్తుతం 811 అడుగులకు చేరుకుంది. దీంతో సాగునీటి అవసరాలకు ఇప్పటికే నీటి ఎత్తిపోతలు నిలిపివేయగా.. కేవలం తాగునీటి కోసమే కేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న గణాంకాల ప్రకారం వేసవిలో తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని మిషన్ భగీరథ అధికారులు చెబుతున్నారు. విద్యుదుత్పత్తి, శ్రీశైలం డ్యాం ద్వారా నీటి విడుదల, ఏపీలోని ప్రాజెక్టులకు నీటి మళ్లింపు వంటివి కొనసాగితే మాత్రం తాగునీటి కష్టాలు ఎదుర్కోక తప్పదు.

మిషన్ భగీరథ ద్వారా..

కొల్లాపూర్ మండలం ఎల్లూరు సమీపంలో నిర్మించిన మిషన్ భగీరథ స్కీం ద్వారా ఉమ్మడి పాలమూరుతోపాటు రంగారెడ్డి జిల్లాలోని 3 నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 84 మండలాల ప్రజలకు తాగునీరు అందుతోంది. ఈ స్కీం కోసం రూ.5,478 కోట్లు గత ప్రభుత్వం ఖర్చు చేసింది. కేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా ఎల్లూరు రిజర్వాయర్‌లోకి కృష్ణానీటిని ఎత్తిపోసి.. అక్కడే నీటిని ఫిల్టర్ చేసి ఇతర ప్రాంతాలకు సరఫరా చేసేలా నిర్మాణాలు చేపట్టారు.

రెండు నెలల కనిష్ట స్థాయిలో..

శ్రీశైలంలో బ్యాక్‌వాటర్ లెవల్స్ క్రమంగా తగ్గుతున్నాయి. గతేడాది మార్చి నెలలో శ్రీశైలం బ్యాక్‌వాటర్ లెవల్స్ 830 అడుగుల మేరకు ఉన్నాయి. ఈ ఏడాది ప్రస్తుతం నీటిమట్టం 811 అడుగులకు చేరుకుంది. అంటే రెండు నెలల కనిష్ట స్థాయిలోకి చేరుకున్నాయి. కేఎల్ఐ ద్వారా 800 అడుగుల ఎత్తు వరకు నీటిని పంపింగ్ చేయవచ్చు. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వల ప్రకారం మరో 6 టీఎంసీలను తాగునీటి అవసరాలకు కేఎల్ఐ ద్వారా ఎత్తిపోసుకోవచ్చు. వేసవి ముగిసే వరకు తాగునీటి అవసరాలకు 3.5 టీఎంసీల నీళ్లు సరిపోతాయని అధికారుల నివేదికలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతానికి తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేనప్పటికీ, అనూహ్య పరిణామాల కారణంగా బ్యాక్‌వాటర్ తగ్గితే మాత్రం నీటి సమస్య ఎదురయ్యే అవకాశం ఉంది.

నిరంతరం పర్యవేక్షణ

శ్రీశైలం ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గుదలపై కృష్ణా రివర్ బోర్డు మేనేజ్‌మెంట్ జనవరిలోనే కేంద్ర జల వనరుల శాఖకు నివేదిక ఇచ్చింది. గత పదేళ్లలో నమోదైన నీటినిల్వల సరాసరితో పోలిస్తే ఈ ఏడాది 48 శాతం తక్కువగా ఉన్నట్లు వారు పేర్కొన్నారు. దీంతో సాగునీరు, విద్యుదుత్పత్తి కంటే తాగునీటి అవసరాలకు కృష్ణానీటిని వినియోగించుకునేలా ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర జల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. అధికారులు నివేదిక ఇచ్చిన సమయంలో శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో 9 టీఎంసీల వరకు తెలంగాణ ప్రభుత్వం వినియోగించుకునే వెసులుబాటు ఉండేది. కానీ, ఫిబ్రవరిలో శ్రీశైలం డ్యాం దిగువకు 3 టీఎంసీల నీటిని విడుదల చేయడంతో బ్యాక్ వా టర్ లెవల్స్ మరింత తగ్గాయి. ఇప్పుడు 6 టీఎంసీల నీళ్లు మాత్రమే వాడుకునే అవకాశం ఉంది.

ఇబ్బందులు ఉండకపోవచ్చు



ప్రస్తుతం తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవు. శ్రీశైలం బ్యాక్‌వాటర్ 811 అడుగుల మేరకు ఉంది. కేఎల్ఐ ద్వారా మిషన్ భగీరథకు నీటి ఎత్తిపోతలు జరుగుతున్నాయి. ఇప్పుడున్న నీటినిల్వ ప్రకారం 6 టీఎంసీల వరకు తాగునీటికి వాడుకోవచ్చు. మిషన్ భగీరథకు వేసవి ముగిసే వరకు 3.5 టీఎంసీల నీళ్లు సరిపోతాయి. నీటి నిల్వలను రెగ్యులర్‌గా పర్యవేక్షిస్తున్నాం.

\- అంజాద్‌పాషా, డీఈఈ, మిషన్ భగీరథ

నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి..

మిషన్ భగీరథ పథకానికి నీటిని అందించే ఎల్లూరు రిజర్వాయర్‌లో నీటినిల్వ సామర్థ్యం కేవలం 0.36 టీఎంసీ మాత్రమే. మిషన్ భగీరథ ద్వారా ప్రతిరోజూ 0.07 టీఎంసీ నీటిని తాగునీటి అవసరాల కోసం సరఫరా చేస్తున్నారు. ఎల్లూరు రిజర్వాయర్‌లో అధికంగా నీటినిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంతో పాలమూరు ప్రాజెక్టుకు మిషన్ భగీరథను అనుసంధానం చేసే చర్యలు చేపట్టారు. పాలమూరు ప్రాజెక్టులో భాగమైన నార్లాపూర్ రిజర్వాయర్‌లో 2 టీఎంసీల మేరకు నీటిని నిల్వ చేశారు. వేసవిలో ఆ నీటిని మిషన్ భగీరథకు మళ్లించేందుకు నీటి పారుదల శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. రిజర్వాయర్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నుంచి సున్నపుతండా సమీపంలో మిషన్ భగీరథకు నీటిని మళ్లించేలా కాల్వలు, పైప్‌లైన్ ఏర్పాటు పనులు జోరుగా సాగుతున్నాయి.

ఆస్తిపన్ను వసూలు అంతంతే..

- విరామం లేకుండా ఇంటింటికీ తిరిగిన సిబ్బంది
- ముగిసిన ఆర్థిక సంవత్సరం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎట్టకేలకు పాలమూరు మున్సిపాలిటీ 15వ ఆర్థిక సంఘం నుంచి మ్యాచింగ్ గ్రాంట్ వచ్చేందుకు అర్హత సాధించింది. ఈ ఆర్థిక సంవత్సరం ఆదివారంతో ముగియగా 50 శాతం ఆస్తిపన్ను వసూలు చేయగలిగారు. ఈ విషయమై లక్ష్యం చేరుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ నెలరోజుల్లో మూడుసార్లు మున్సిపల్ అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత లక్ష్యం నిర్దేశించడంతో వారు ఉరుకులు, పరుగులు పెట్టారు. ఎలాంటి విరామం లేకుండా ఇంటింటికీ తిరిగారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో వారంలో మూడు రోజులు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడంతో ఆస్తిపన్ను చెల్లించడానికి ప్రజలు ముందుకు వచ్చారు. మరోవైపు గత నెల చివర్లో రాష్ట్ర ప్రభుత్వం పాత బకాయిల వసూళ్ల కోసం వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) కింద 90 శాతం వడ్డీ రాయితీ కల్పించింది. దీనిపై పట్టణ ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించడంతో స్పందన వచ్చింది. వాస్తవానికి 2023- 24 ఆర్థిక సంవత్సరంలో 49,909 మంది నుంచి రూ.18.72 కోట్లు రావాల్సి ఉంది. ఇందులో చివరిరోజు వరకు రూ.16 కోట్లు వసూలు చేయగలిగారు. అలాగే పాత బకాయిలు రూ.29.20 కోట్లకు గాను సుమారు రూ.8 కోట్లు రాబట్టగలిగారు. ఇలా ఇప్పటి వరకు మొత్తం రూ.24 కోట్లు వసూలు చేశారు. కాగా గత నెల 16 వరకు ఆస్తిపన్ను 22 శాతం మాత్రమే రాగా, ఈ నెల 15 నాటికి 32 శాతం, గడువు ముగిసే వరకు 50 శాతానికి చేరుకున్నారు. ఇందులో చివరి వారం రోజుల్లో ఎక్కువగా వసూలు చేయగలిగారు. ఈ నెల 25న రూ.15 లక్షలు, 26న రూ.22 లక్షలు, 27న రూ.32.20 లక్షలు, 28న రూ.33 లక్షలు, 29న రూ.40.50 లక్షలు, 30న రూ.65 లక్షలు, 31న రూ.70 లక్షలు వచ్చాయి.



వన్‌టౌన్ ప్రాంతంలో ఆస్తిపన్ను వసూలును పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

భూత్పూర్ మున్సిపాలిటీలో..

జిల్లాలోని భూత్పూర్ మున్సిపాలిటీలో 3,469 మంది నుంచి ఈ ఆర్థిక సంవత్సరంలో ఆస్తిపన్ను రూ.1,98,35,000 రావాల్సి ఉండగా.. రూ.1,61,64,000 వచ్చింది. అలాగే పాత బకాయిల కింద రూ.66,12,000కు గాను రూ.25,84,000 వసూలైంది. ఇలా మొత్తం రూ.2,64,47,000 రావాల్సి ఉండగా రూ.1,87,48,000 (70.89 శాతం) వసూలు చేశారు.

వరిధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం

- నేటినుంచి ప్రారంభించేందుకు అధికారుల సన్నాహాలు
- ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో కేంద్రాల ఏర్పాటు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): జిల్లాలో యాసంగి వరిధాన్యం కొనుగోళ్లకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఏప్రిల్ మొదటి వారం నుంచి ధాన్యం మార్కెట్‌కు రానుండడంతో అందుకు అనుగుణంగా అధికారులు ప్రణాళిక రూపొందించారు. కొనుగోళ్లకు అవసరయ్యే సామగ్రి అందుబాటులో ఉంచే ఏర్పాట్లపై దృష్టిసారించారు. జిల్లావ్యాప్తంగా యాసంగిలో 1,27,892 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో ప్రధానంగా 1,11,724 ఎకరాల్లో వరి వేశారు. వరి సాగుకు అనుగుణంగా దిగుబడిపై పౌర సరఫరాల శాఖ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది.

ప్రభుత్వానికి మించి..

ధాన్యం కొనుగోళ్లకు రంగం సిద్ధం చేసిన అధికార యంత్రాంగం రైతుల వద్ద నుంచి ఏ-గ్రేడ్ ధాన్యం ధర క్వింటాల్‌కు రూ.2,203 నిర్ణయించగా.. సాధారణ రకానికి రూ.2,183 నిర్ణయించారు. ఇక గత సీజన్‌లో ప్రభుత్వం చెల్లించే ధర కంటే వ్యాపారులు అధికంగా వెచ్చిస్తుండటంతో వానాకాలం ధాన్యాన్ని ఎక్కువగా వారికే రైతులు విక్రయించారు. యాసంగిలో సైతం ధర ఎక్కువగా చెల్లించే వారికే రైతులు వరిధాన్యం విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది. ఏప్రిల్ మొదటి వారం నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించే దిశగా సన్నాహాలు చేస్తున్నారు.

అందుబాటులో ఉండేలా..

జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉండే విధంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో 441 గ్రామాలు ఉండగా.. 190 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ఐకేపీ ద్వారా 98, పీఏసీఎస్‌లు 87, డీసీఎంఎస్ 4 కేంద్రాలు, మెప్మా ఒకటి చొప్పున కేంద్రాల ఏర్పాటుకు యాక్షన్ ప్లాన్ రూపొందించారు. అలాగే ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన గన్నీ బ్యాగులు 35.50 లక్షలు అందుబాటులో ఉన్నాయి. కొనుగోళ్ల కోసం టార్పాలిన్లు 5,353, పాడీ క్లీనర్లు 195, మాయిశ్చరైజ్ మీటర్లు 286, వేయింగ్ మిషన్లు 365 వంటి పరికరాలు అందుబాటులో ఉంచారు. జిల్లాలో 25 బాయిల్డ్ రైస్ మిల్లులు ఉండగా వీటికి ధాన్యం కేటాయించనున్నారు.



మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి ధాన్యం తూకం వేస్తున్న కూలీలు (ఫైల్)

వాతావరణ మార్పులకు..

అకాల వర్షాలు వస్తే ధాన్యం తడిచి మద్దతు ధర పలకదేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారుతుండటంతో కొనుగోలు కేంద్రాల్లో అదనంగా టార్పాలిన్లు నిల్వ చేస్తున్నారు. కేంద్రాల్లో ఎక్కువగా ధాన్యం నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు రవాణా చేసేందుకు వీలుగా సరిపడా వాహనాలను ఏర్పాటు చేశారు. రైతులకు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు నష్టం వాటిల్లకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు ఇప్పటికే మొదలుపెట్టారు.

సద్వినియోగం చేసుకోవాలి..

జిల్లావ్యాప్తంగా 190 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నాం. ఈ కేంద్రాల ద్వారా 1.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని నిర్ణయించాం. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తాం. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి.

\- ప్రవీణ్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

జిల్లాలో సాగైన వరిపంట	1,11,724 ఎకరాలు
దిగుబడి అంచనా 2.16 లక్షల మె.ట.,	ధాన్యం సేకరణ లక్ష్యం 1.32 లక్షల మె.ట.,
ఏర్పాటు చేయనున్న కొనుగోలు కేంద్రాలు 190	ప్రభుత్వ మద్దతు ధర ఏ-గ్రేడ్ : రూ.2,203
బీ-గ్రేడ్ రకానికి రూ.2,183	అందుబాటులో ఉన్న గన్నీ బ్యాగులు : 35.50 లక్షలు

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువతి మృతి


శివాణి (ఫైల్)

హన్వాడ: చికిత్స పొందుతూ యువతి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వేపూరు గ్రామానికి చెందిన శివాణి హైదరాబాద్‌లో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. కాగా పెళ్లి చూపుల కోసం గురువారం స్వగ్రామానికి వచ్చింది. శుక్రవారం విరోచనాలు కావడంతో గ్రామంలోని ఓ ఆర్ఎంపీ వద్దకు వెళ్లి మాత్రలు తీసుకున్నారు. కొంత వరకు నయం కాగా, శనివారం నీరసంగా ఉండడంతో మళ్లీ ఆర్ఎంపీ వద్దకు వెళ్లారు. ఆయన సెలైన్ బాటిల్ ఎక్కించడంతో తీవ్ర చలిజ్వరం వచ్చింది. దీంతో వెంటనే ఆమెను మహబూబ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి ఆమె మృతి చెందింది.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు..


గోవిందమ్మ (ఫైల్)

అయిజ: అయిజ–రాయిచూర్ రోడ్డుపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గోవిందమ్మ (65) మృతి చెందింది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాలు ఇలా.. గట్టు మండలం చిన్నోనిపల్లికి చెందిన గోవిందమ్మ తన మనవరాలి ప్రసవం నిమిత్తం అయిజలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆమెను చూసేందుకు గోవిందమ్మ మనువడుతో కలిసి ద్విచక్ర వాహనంపై చిన్నోనిపల్లి నుంచి అయిజకు బయలు దేరింది. అయిజ సమీపంలో రాయచూరు రోడ్డు మార్గంలో బైక్‌పై నుంచి జారి కిందపడింది. గోవిందమ్మ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఆమెకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడు బలవన్మరణం

అచ్చంపేట రూరల్: కుటుంబ కలహాలతో పట్టణంలోని ఇంద్రనగర్ కాలనీలో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పట్టణ రెండవ ఎస్ఐ శివయ్య, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రనగర్‌కాలనీకి చెందిన బుద్దుల సాలయ్య(33) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు విగతజీవిగా ఉన్న సాలయ్యను చూసి బోరున విలపించారు. సాలయ్య తల్లి పార్వతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. భార్య వివాహేతర సంబంధం తట్టుకోలేకనే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని తల్లి ఫిర్యాదులో పేర్కొంది. మృతుడికి భార్యతో పాటు కుమారుడు ఉన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రైలు నుంచి జారిపడి వృద్ధుడి దుర్మరణం

ఆత్మకూర్: రైలులో ప్రయాణం చేస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలోని శ్రీరాంనగర్ రైల్వేస్టేషన్ వద్ద చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా.. గద్వాల పట్టణం ఒంటెలపేటకు చెందిన బోయ గోపాల్‌నాయుడు(60) మదనాపూర్ రైల్వేస్టేషన్ నుంచి గద్వాలకు వచ్చేందుకు కాచిగూడ–గుంటూర్ రైల్లో ప్రయాణం చేశాడని తెలిపారు. శ్రీరాంనగర్ రైల్వేస్టేషన్‌లో ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడని గమనించిన ప్రయాణికులు అంబులెన్స్‌లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారని అన్నారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో కర్నూల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడని వివరించారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రామన్‌పాడులో 1,011 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,011 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ, కుడి కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. జిల్లా తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

బాలానగర్: అనుమతి లేకండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఆదివారం రాజాపూర్ మండలంలోని మల్లేపల్లికి చెందిన కృష్ణయ్య, శ్రీశైలం, సాయిలుకు చెందిన మూడు ట్రాక్టర్లలో డ్రైవర్లు బాలస్వామి, సైదులు, పర్వతాలు ఇసుకను తరలిస్తూ బాలానగర్ మండలంలోని బోడజానంపేట్‌లో పట్టుపడ్డారు. ఈ ఘటనపై ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపాజీ తెలిపారు.



అడ్డగోలుగా వెంచర్లు

- డీటీసీపీ స్థానంలో వెలసిన కచ్చ లేఅవుట్
- వెడల్పు తగ్గిన రోడ్లు, కమ్యూనిటీ స్థలాలు, ప్లాట్ల కుదింపు


నిబంధనల మేరకు రోడ్లు, మౌలిక సదుపాయాలు లేని డీటీసీపీ వెంచర్

జడ్చర్ల: అన్ని మౌలిక సదుపాయాలతో ఏర్పాటు చేయాల్సిన వెంచర్లు ఆయా సౌకర్యాలు లేకుండానే అడ్డగోలుగా ఏర్పాటు చేసి రియల్టర్లు ప్లాట్ల విక్రయాలకు పాల్పడుతున్నారు. నియోజకవర్గంలో అనేక వెంచర్ల యజమానులు నిబంధనలు బేఖాతరు చేస్తున్నారు. ఎక్కడా ప్రభుత్వ డీటీసీపీ నిబంధనలు అమలు కావడం లేదు.

నాడు డీటీసీపీ నేడు కచ్చ లేఅవుట్

నాటి బాదేపల్లి పంచాయతీ పరిధిలో దశాబ్దాల కిందటే కచ్చ లేఅవుట్‌లు ఏర్పాటు చేస్తున్న రోజుల్లోనే పట్టణ శివారులో ఓ వెంచర్‌ను డీటీసీపీ అనుమతులతో ఏర్పాటు చేశారు. అయితే ఇదే లేఅవుట్‌ను వెంచర్ యజమానులు తాజాగా మార్పులు చేర్పులు చేసి కచ్చ లేఅవుట్‌గా మార్చారు. దీంతో డీటీసీపీ లేఅవుట్‌లో ఉన్న నిబంధనలు తుంగలో తొక్కి 40, 33 అడుగుల వెడల్పు ఉన్న రోడ్లు 30, 25 అడుగుల మేరకు కుదించుకుపోయాయి. ఇక కమ్యూనిటీ అవసరాలకు విడిచిన స్థలాలు కూడా కనుమరుగయ్యాయి. ఇక ప్లాట్ల సైజులు కూడా పొడవు, వెడల్పులు తగ్గి 200 చదరపు గజాల నుంచి 150 చదరపు గజాలకు చేరుకున్నాయి. ఇక ఈ వెంచర్‌లో రోడ్లు లేకపోవడంతో పాటు విద్యుత్, తాగు నీరు, డ్రైయినేజీ తదితర ఎలాంటి వసతులు కల్పించలేదు.

బాదేపల్లి శివారులో..

బాదేపల్లి శివారులో క్లబ్ రోడ్డు పరిధిలోని సర్వే నంబర్లు 18/2,18/3లలో గల 26.39 ఎకరాలలో గల భూమిని 1990–91లో వెంచర్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి 1992లో డీటీసీపీ నుంచి అనుమతులు కూడా పొందారు. ఎల్‌పీ నంబర్ 53/92 డీటీసీపీ లేఅవుట్ అనుమతుల ప్రకారంగా మొత్తం 26.39 ఎకరాల విస్తీర్ణంలో 5శాతం ప్రకారంగా కమ్యూనిటీ అవసరాల నిమిత్తం 1.32 ఎకరాలు కేటాయించారు. ఇక అంతర్గత రహదారులకు సంబంధించి 9.35 ఎకరాలు కేటాయించారు. మిగతా విస్తీర్ణంలో 200 చదరపు గజాలతో 336 ప్లాట్లను ఏర్పాటు చేసి వినియోగదారులకు విక్రయించి రిజిస్ట్రేషన్ చేశారు. సదరు వెంచర్ చేసిన భూమి ప్రభుత్వానికి సంబంధించిన భూమిగా పేర్కొంటూ ఓ వ్యక్తి కోర్టును ఆశ్రయించడంతో వివాదం తలెత్తింది. దీనికి తోడు భూ యజమానుల సంతతికి చెందిన కొందరు కూడా వెంచర్ భూమిపై తమకు హక్కులున్నాయని పేర్కొంటూ కోర్టును ఆశ్రయించారు. దీంతో వెంచర్‌లో తదుపరి ప్లాట్ల క్రయవిక్రయాలు నిలిచిపోవడంతో పాటు నిర్మాణాలకు అనుమతులు నిలిచిపోయాయి.


వెంచర్‌కు సంబంధించి అధికారులు జారీ చేసిన డీటీసీపీ లేఅవుట్

కోర్టులో విచారణ

వెంచర్‌ను ఏర్పాటు చేసిన వారు కోర్టు విచారణను ఎదుర్కొన్నారు. హైకోర్టు, సుప్రీంకోర్టు వరకు న్యాయ విచారణ కొనసాగిన తర్వాత వెంచర్ యజమానులకు అనుకూలంగా తీర్పు వచ్చిందని పేర్కొంటు వెంచర్‌ను స్వాధీన పరుచుకునేందుకు కొద్ది నెలల కిందట ప్రయత్నించారు. దీంతో కోర్టులో సదరు భూమిపై హక్కులు ఉన్నాయని పేర్కొంటూ కేసు వేసిన వారు అడ్డుకున్నారు. వెంచర్ యజమానులు పోలీసులను ఆశ్రయించి వారి సహకారంతో భూమిని స్వాధీన పర్చుకున్నారు. తదుపరి డీటీసీపీ లేఅవుట్‌ను ఏమార్చి కచ్చ లేఅవుట్‌ను రూపొందించి అమలు పరిచేందుకు రంగం సిద్ధం చేసి వెంచర్‌లో పనులను మొదలు పెట్టారు.

నిర్వాహకుల నిలదీత

డీటీసీపీ లేఅవుట్‌ను ఎందుకు మార్చారని వెంచర్ నిర్వాహకులను ప్రశ్నిస్తే తమకు కోర్టు విచారణను ఎదుర్కొనేందుకు ఖర్చులు అయ్యాయని కోర్టు ఖర్చులను రాబట్టుకునేందుకు లేఅవుట్‌ను మార్చాల్సి వచ్చిందని నిర్వాహకులు పేర్కొంటున్నారు. కాగా ప్లాట్లను విక్రయించి రిజిస్ట్రేషన్ చేసే సమయంలో సదరు ప్లాటుకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉత్పన్నమయినా తమ సొంత ఖర్చులను భరించి పరిష్కరిస్తామని దస్తావేజులలో పేర్కొన్నారని ఈ సందర్భంగా వారు గుర్తు చేస్తున్నారు. వివాదాస్పదంగా ఉన్న ప్లాట్లను విక్రయించి తమను ఇబ్బందులకు గురిచేసిన వెంచర్ నిర్వాహకులే తమకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుందని వారు తెలిపారు.


డీటీసీపీ లేఅవుట్‌ను ఏమార్చి వెంచర్ యజమానులు కొత్తగా రూపొందించిన కచ్చ లే అవుట్

పట్టించుకోని అధికారులు

వెంచర్ల ఏర్పాటు, నిబంధనలను అమలు చేయాల్సిన మున్సిపల్ అధికారులు, పాలకులు ఇంత తతంగం జరుగుతున్నా పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పండుటాకు పాదయాత్ర



ఆ వృద్ధురాలి వయసు 91 ఏళ్లు. వృద్ధాప్యాన్ని సైతం లెక్కచేయకుండా శ్రీశైల క్షేత్రానికి పాదయాత్ర చేపట్టింది. వివరాల్లోకి వెళ్తే.. కర్ణాటక రాష్ట్రం జవరిగి ప్రాంతానికి చెందిన బోరమ్మ 46 ఏళ్లుగా శ్రీశైల క్షేత్రానికి పాదయాత్రగా వెళ్లి, భ్రమరాంబిక మల్లికార్జునస్వామిని దర్శించుకుంటోంది. ఈసారి కూడా స్థానికులతో కలిసి శ్రీశైల క్షేత్రానికి బయల్దేరింది. వీరి పాదయాత్ర ఆదివారం గట్టుకు చేరింది. ఇప్పటి వరకు 150 కిలో మీటర్ల పాదయాత్ర పూర్తిచేసుకున్నామని.. మరో 200 కిలోమీటర్ల దూరం పాదయాత్ర చేయాల్సి ఉందని తెలిపారు. ఉగాది పర్వదినాన శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జునస్వామిని దర్శించుకుని, తిరుగు ప్రయాణమవుతామని చెప్పారు. కాగా, తన ప్రాణం ఉన్నంత వరకు పాదయాత్ర చేస్తూనే ఉంటానని.. తనను శ్రీశైల మల్లన్ననే నడిపిస్తున్నాడని వృద్ధురాలు బోరమ్మ పేర్కొంది. కర్ణాటకకు చెందిన మరో భక్తుడు కాళ్లకు కర్రలను కట్టుకుని, గట్టు మీదుగా శ్రీశైల క్షేత్రానికి పాదయాత్రగా బయల్దేరాడు. – గట్టు

అయోధ్య రామయ్యకు అమరచింత పట్టువస్త్రాలు


పట్టువస్త్రాలతో అయోధ్యకు వెళ్తున్న భక్తులు

అమరచింత: అయోధ్య రామయ్యకు వనప్తి జిల్లా అమరచింత పద్మశాలీలు పట్టువస్త్రాలను తయారు చేసి ఆలయంలో సమర్పించేందుకు గాను ఆదివారం అయోధ్యకు తరలివెళ్లారు. అమరచింతకు చెందిన సాక రమేష్, సాక మాసన్న కుటుంబ సభ్యులతో కలిసి పక్షం రోజుల నుంచి ప్రత్యేక మగ్గంపై శ్రీరాముడికి పట్టువస్త్రాలను నేత పనులు మొదలుపెట్టారు. పట్టువస్త్రాల తయారీ పూర్తికావడంతో ఆదివారం వాటికి స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మేళతాళాల మధ్య పట్టణ పురవీధుల గుండా ఊరేగించి అయోధ్యకు తీసుకువెళ్లారు. వారితోపాటు పట్టణానికి చెందిన పది మంది భక్తులు అయోధ్యకు వెళ్లారు.

ఉత్సాహంగా కిక్‌బాక్సింగ్ టోర్నీ


పతకాలు సాధించిన విద్యార్థులతో అసోసియేషన్ ప్రతినిధులు, ప్రిన్సిపాల్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ ఆవరణలో ఆదివారం జిల్లాస్థాయి కిక్ బాక్సింగ్ టోర్నమెంట్‌తో పాటు రాష్ట్రస్థాయి ఎంపికలు నిర్వహించారు. పాయింట్ ఫైట్, మ్యూజికల్‌ఫాంలో 50 మంది విద్యార్థులు పాల్గొనగా రాష్ట్రస్థాయి పోటీలకు 30 మంది విద్యార్థులు ఎంపికైనట్లు స్పోర్ట్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.రవికుమార్ తెలిపారు. కాగా హేమశ్రీ, మనశ్విత, సృజన, సౌమ్య, లాస్య, అర్షశ్రీ, నవ్య, శ్రేయ, పద్మప్రియ, యామిని, వర్షిని, జె.శివప్రసాద్, అగస్త్యసాయి, జితిన్, రాహుల్, హర్ష, యశ్వంత్, శ్రీవత్స, ఆదికేశవరెడ్డి, అభిలేష్, దీక్షిత్, మణిచరణ్, శివప్రసాద్, సాత్విక్, విశాల్, విగ్నేష్, జశ్వంత్, జయదీప్, రోహిత్‌లు వనపర్తిలో సోమవారం నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను స్కూల్ ప్రిన్సిపాల్ శాంత అభినందించారు. విజేతలుగా నిలిచిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభచాటి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవినాయక్, సలహాదారులు ఎంఎస్.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తనిఖీల్లో నగదు పట్టివేత


గోపాల్‌పేటలో పట్టుబడిన నగదు

గోపాల్‌పేట: వనపర్తి జిల్లా సరిహద్దు బుద్దారం గండి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం రూ.1.35లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. మండలంలోని ఆముదాలకుంటతండాకు చెందిన వద్యావత్ బాషా నగదు తీసుకెళ్తుండగా, అందుకు సంబంధించి ఎలాంటి రశీదులు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.


రాజాపూర్‌లో పట్టుబడ్డ నగదుతో పోలీసులు

రాజాపూర్: మండల కేంద్రంలో ఆదివారం ఎస్ఐ రవి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి అనంతపూర్ వెళ్తున్న డీసీఎంలో రూ.2.39లక్షల నగదు గుర్తించారు. వాటికి సంబంధించిన వివరాలను డ్రైవర్ లైకుద్దీన్ ఇవ్వకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్ఐ రవి తెలిపారు.

మరికల్: మండలంలోని లాల్‌కోటచౌరస్తాలో పోలీసుల తనిఖీలో భాగంగా ఆదివారం రాత్రి బొలెరో వాహనంలో రూ. 1.65 లక్షల నగదును పట్టుకున్నారు. హైదరాబాద్ నుంచి కర్ణాటకకు వెళ్తున్న మాలప్ప అనే వద్ద నగదు లభించినట్లు తెలిపారు. నగదును సీజ్ చేశామని ఎస్ఐ మురళీ తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు


బెల్లం ఊటను పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఉప్పునుంతల: మండలంలోని దేవదారికుంటతండా, గుట్టమీది తండాల్లో ఆదివారం ఉదయం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడిలో 1,200 లీటర్ల బెల్లం ఊటను పారబోయడంతోపాటు అందుకు ఉపయోగించిన డ్రమ్ములు, కుండలను ధ్వంసం చేశారు. ఆయా తండాల్లో 24 లీటర్ల సారా, 20 కేజీల పటికను స్వాధీనం చేసుకొని ఇద్దరు మహిళలను అరెస్టు చేసినట్లు తెలకపల్లి ఎక్సైజ్ సీఐ రమణయ్య తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బాలకృష్ణారెడ్డి, డీటీఎఫ్ సీఐ కల్యాణ్, కల్వకుర్తి ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి, ఎస్ఐలు పాల్గొన్నారు.

స్తంభాన్ని ఢీకొట్టిన కర్ణాటక బస్సు

మహబూబ్‌నగర్ క్రైం: వేగంగా వస్తున్న బస్సు అదుపు తప్పి డివైడర్ మధ్యలో ఉన్న స్తంభానికి ఢీకొట్టడంతో ప్రయాణికులకు గాయాలు అయ్యాయి. వన్‌టౌన్ సీఐ అప్పయ్య కథనం ప్రకారం.. కర్ణాటక ఆర్టీసీకి చెందిన (కేఏ 34 ఎఫ్ 1371) బస్సు ఆదివారం తెల్లవారుజామున 3:30ప్రాంతంలో కర్ణాటక వైపు నుంచి హైదరాబాద్ వెళ్తూ మార్గమధ్యలో మహబూబ్‌నగర్ పట్టణంలోని తూర్పు కమాన్ వద్ద అత్యంత వేగంతో పాటు నిర్లక్ష్యంగా నడపడం వల్ల రోడ్డుపై ఉన్న డివైడర్ మధ్యలోని స్తంభానికి ఢీకొట్టింది. దీంతో బస్సులో ఉన్న ఆరుగురు ప్రయాణికులకు గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

బ్యాటరీ కంపెనీతో గాలి, నీరు కాలుష్యం


నిరసన దీక్షకు మద్దతు తెలిపిన మహబూబ్‌నగర్ అభివృద్ధి ఫోరం సభ్యులు

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లాకేంద్రం పరిధిలోని దివిటిపల్లి– ఎదిర గ్రామ శివారులో ఏర్పాటు చేయబోతున్న అమర రాజా బ్యాటరీ కంపెనీకి వ్యతిరేకంగా చేపట్టిన ఆయా గ్రామాల ప్రజలు చేపట్టిన శాంతియుత నిరసన దీక్ష ఆదివారం నాటికి 16వ రోజుకు చేరింది. దీక్షకు మహబూబ్‌నగర్ అభివృద్ధి ఫోరం మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా ఫోరం చైర్మన్ మున్నూరు రవి మాట్లాడుతూ అమర రాజా బ్యాటరీ తయారు చేసే కంపెనీ వల్ల ఈ ప్రాంతంలో కాలుష్యం ఏర్పడుతుందన్నారు. నీరు, గాలి కాలుష్యంతోపాటు ప్రజారోగ్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. దివిటిపల్లి, అంబట్‌పల్లి, ఎదిర, సిద్ధాయపల్లి గ్రామాలతోపాటు మహబూబ్‌నగర్ పట్టణానికి కూడా ప్రమాదం వాటిల్లబోతోందన్నారు. ఎలాంటి అభిప్రాయ సేకరణ జరగకుండానే కంపెనీ ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి ప్రమాదకర బ్యాటరీ కంపెనీని ఈ ప్రాంతం నుంచి తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అమర రాజ కాలుష్య పరిశ్రమ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు విజయ్‌కుమార్, ఫోరం సభ్యులు వెంకటేష్, పాపిశెట్టి చంద్రకాంత్, రమేష్, సాయికృష్ణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు రాలే..

- మూడు నెలలుగా ఉపాధి సిబ్బందికి అందని వేతనాలు
- జిల్లావ్యాప్తంగా 155 మంది ఉద్యోగులు
- భారంగా మారిన కుటుంబ పోషణ
- ఐకేపీ వారిది సైతం అదే పరిస్థితి


ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు రావడం లేదు. ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఒకటో తేదీన జీతాలు వేస్తున్నామని కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ.. ఉపాధి హామీ ఉద్యోగులు మాత్రం పస్తులు ఉండాల్సిన పరిస్థితి దాపురించింది. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణులకు స్థానికంగానే పని కల్పించేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. అలాంటి పథకంలో పనిచేస్తున్న సిబ్బందికే జీతాలు రాకపోవడంపై అందరూ విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

పండుగ పూట పస్తులే..

జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద వివిధ కేటగిరీలలో 155 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఇందులో ఏపీఓలు, ఈసీలు, ఎఫ్ఏలు, టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు ఉన్నారు. అయితే జనవరి 1న కొత్త సంవత్సరం, సంక్రాంతి సైతం ఉపాధి సిబ్బంది ఇళ్లలో పండుగ జరుపుకోలేని పరిస్థితి నెలకొందని ఉద్యోగులు వాపోతున్నారు. ఇదే కాకుండా కుటుంబ పోషణ కూడా భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా ఉద్యోగుల జీతాలు, ఇతర అవసరాలకు అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తుంది. ఏ నెలకు ఆ నెలా సరిపడా బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం జీతాలు ఇవ్వకుండా పస్తులు ఉంచిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం..



ఈజీఎస్ ఉద్యోగుల జీతాల అంశం ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. వేతనాలు త్వరగా మంజూరు చేయించేలా చర్యలు తీసుకుంటాం. త్వరలోనే జీతాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.
– నర్సింహులు, డీఆర్‌డీఓ

వారికి జనవరి నెల జీతం..

గ్రామీణ అభివృద్ధి శాఖలో ఉన్న మరో విభాగం ఐకేపీ ఉద్యోగులు. ఈ ఉద్యోగులకు కూడా రెండు నెలలుగా జీతాలు రావడం లేదు. జనవరి నెలకు చెందిన జీతం ఫిబ్రవరి 29న జనరేట్ అయింది. అంటే వీరికి మార్చి 1న జీతం వస్తుంది. దీంతో జనవరి జీతం మార్చి 1న వచ్చినట్లు అయిందని ఉద్యోగులు అనుకుంటున్నారు. ఇక ఫిబ్రవరి నెల జీతం ఎప్పుడు వస్తుందో అని ఐకేపీ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. జిల్లాలో మొత్తం 76 మంది ఐకేపీ ఉద్యోగులు ఉండగా.. డీపీఎం, ఏపీఎం, సీసీ ఇతర సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రతినెలా బ్యాంకు లోన్లు, నెలవారి కిస్తులు, ప్రైవేట్ ఫైనాన్స్‌లో చీటీలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రతినెలా జీతం రాకపోవడంతో కిస్తులు చెల్లించక డిఫాల్ట్ కిందకు పోతామని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం కొన్ని శాఖలకు మాత్రమే ప్రతినెలా 1న జీతాలు ఇస్తున్న ప్రభుత్వం తమకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తున్నారు.

ఎట్ల బతకాలె..



మూడు నెలల నుంచి జీతాలు రావడం లేదు. ఎట్ల బతకాలో అర్థం కావడం లేదు. ఉపాధి హామీ పథకం కింద ఎంతో మంది కూలీలకు పనులు కల్పిస్తున్న మాకు జీతాలు రాకపోవడం బాధాకరం. తమకు కొత్త ప్రభుత్వంలో పే స్కేల్ అమలు చేస్తామని హామీ ఇచ్చినా.. ఆ ఊసే లేదు. త్వరగా జీతాలు ఇచ్చి ఆదుకోవాలి. ప్రభుత్వ ఉద్యోగులు మాదిరిగానే మాకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.
– వెంకట్‌నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ జిల్లా నాయకుడు

క్రమం తప్పకుండా ఇవ్వాలి..



ప్రభుత్వ ఉద్యోగులు మాదిరిగానే తమకు ప్రతినెలా క్రమం తప్పకుండా జీతాలు ఇవ్వాలి. నెలనెలా జీతాలు రాకపోవడంతో కుటుంబాలను పోషించుకోలేక పోతున్నాం. అప్పులు చేస్తూ జీవనం సాగిస్తున్నాం. కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని మరచిపోతుంది. ప్రభుత్వ నిర్ణయంపై ఎంతో ఆశలు పెట్టుకున్నాం.
– నారాయణగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్